1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | డిసెంబర్ 06, 2023 | www.navatelangana.com

గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధించాం

నవతెలంగాణ-సదాశివనగర్

గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధించామని బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం సదాశివనగర్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2018లో ఒకే సీటు గెలిచి 2024 సంవత్సరంలో 8 సీట్లు గెలిచామని అన్నారు. 14 శాతం ఓట్లు పోలయ్యాయని అన్నారు. కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించారని అన్నారు. 100 రోజులలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకపోతే బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుందని సూచించారు. ఈ నెల 20 లేదా 25వ తేదీ నుండి ప్రజా ఆశీర్వద పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. మాచారెడ్డి నుంచి పార్లమెంట్ నియోజకవర్గం జహీరాబాద్ వరకు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో బి.జె.పి మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హెూటల్ మోహన్, కొప్పుల గంగారెడ్డి, సంకరి విఠల్, కుంట సాయిరెడ్డి, కంలడి సాయిరెడ్డి, మల్లారెడ్డి, కుంట వేణు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక ఎమ్మెల్యేను కలిసిన బీబీపేట్ మండల నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి



కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలం జనగామ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి బిబిపేట్ మండల బిఆర్ఎస్ నాయకులతో కలిసి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. దుబ్బాకలో ఎన్నికల ప్రచారంలో జరిగిన కత్తిపోటు విషయం నేపథ్యంలో ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కలిసిన వారిలో బీబీపేట బీఆర్ఎస్ మండలాధ్యక్షులు వెంకటగౌడ్, బీబీపేట్ వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, జనగామ మాజీ సర్పంచ్ మట్ట శ్రీనివాస్, ఇస్సానగర్ మాజీ సర్పంచ్ వెంకట రమణగౌడ్ తదితరులున్నారు.

పనిచేసినా.. వేతనాల్లేవ్..

- ఏడు నెలల నుంచి పారిశుధ్య కార్మికులకు అందని వేతనాలు
- వేతనాల కోసం చెక్కులు పంపినా.. ట్రెజర్‌లో పెండింగ్‌లో..
- అప్పుల పాలవుతున్న కుటుంబాలు
- త్వరగా చెల్లించాలని వేడుకోలు

వారు చెమటోడ్చి మురికిగా మారుతారు. కానీ సమాజానికి మాత్రం స్వచ్ఛతను, శుభ్రతను అందిస్తారు. వారి రెక్కల కష్టం లేకుంటే.. లోకమంతా మురికి వాసనే. వారు సమ్మె చేస్తే.. ఊరు వాడ దుర్గంధమే. వారు లేని సమాజాన్ని ఊహించుకోలేం. వారి రెక్కల కష్టం వెలకట్టలేనిది. వారే పారిశుధ్య కార్మికులు. ఆ కార్మికులకు 7 నెలల నుంచి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వచ్చేది అరకొర.. అవీ సరైన సమయానికి రాకపోవడంతో అప్పుల పాలు కావాల్సిన దుస్థితి నెలకొంటుందని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నవతెలంగాణ-రామారెడ్డి

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 23 మండలాల్లో 526 గ్రామపంచాయతీల పరిధిలో పారిశుధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామపంచాయతీలకు దాదాపు రాష్ట్ర ప్రభుత్వం ఒక సంవత్సరం నుంచి నిధులు మంజూరు చేయకపోవడం.. చిన్న గ్రామపంచాయతీలో జనరల్ ఫండ్ జమ కాకపోవడం, కేంద్ర ప్రభుత్వం ప్రతి నెల విడుదల చేస్తున్న నిధులతో తప్పనిసరిగా విద్యుత్ బిల్లులను, మూడు నెలలకు ఒకసారి ట్రాక్టర్ బకాయిలు, 10 శాతం హరిత నిధికి కేటాయించటంతో, గ్రామ పంచాయతీలో అత్యవసర పనులు నిర్వహించడంతో, గ్రామపంచాయతీలో నిధులు లేకపోవడంతో పారిశుధ్య కార్మికులకు గ్రామ పంచాయతీలు వేతనాలు చెల్లించకపోవడం, కొన్ని గ్రామపంచాయతీ వేతనాలకు చెక్కులు పంపిన ట్రెజర్‌లో పెండింగ్‌లో ఉండటం కార్మికులకు వేతనాలు అందటం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి జిల్లావ్యాప్తంగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పారిశుధ్య కార్మికులు కోరుతున్నారు.



చెత్తను ట్రాక్టర్‌లో సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

పోషణ భారమవుతోంది



గత 7 నెలల నుండి వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. దీంతో కుటుంబ పోషణ భారమవుతోంది. కుటుంబ పోషణకు అప్పు లు చేయవలసి వస్తుంది. పెద్ద సార్లు స్పందించి మాకు జీతాలు అందించేలా కృషి చేయాలి. - గొర్రె భీమేష్, పారిశుధ్య కార్మికుడు

జీతాలు అందేలా కృషిచేస్తా

రెండు మూడు నెలల నుంచి పారిశుధ్య కార్మికుల చెక్కులు ట్రెజర్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిధులు నవంబర్ 28న మంజూరయ్యాయి. ఎక్కడైనా కార్మికులకు జీతాలు అందించకుంటే, పంచాయతీ కార్యదర్శులను వివరణ కోరి, జీతాలు అందేలా కృషి చేస్తా.
- సాయిబాబా, డీఎల్‌పిఓ కామారెడ్డి

వర్షంతో తిప్పలు

పూర్తి కాని ధాన్యం కొనుగోళ్లు.. రైతులకు ఇబ్బందులు

నవతెలంగాణ-కామారెడ్డి

వరి ధాన్యం అమ్మకం చివరిలో రైతులకు తిప్పలు తప్పడం లేదు. గత 3, 4 రోజుల నుంచి ఆకాశం మేఘావృత్తమై ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం ఎప్పుడు పడుతుందో ఎప్పుడు పడటం లేదో తెలియని పరిస్థితిలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. మంగళవారం మధ్యాహ్నం భారీ మబ్బులు పట్టి వర్షం కురవడంతో రైతులు తమ ధాన్యాన్ని రక్షించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా సుమారు వరి ధాన్యం కొనుగోళ్ల 80శాతం వరకు పూర్తయ్యాయి. వర్షాకాలంలో వరి నాట్లు వేయడం ఆలస్యమవడంతో వరి కోత సైతం ఆలస్యమైంది. దీంతో ధాన్యం ఆరబెట్టి.. తూకం వేయించడం ఆలస్యమైంది. అయితే గత 2,3 రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండడంతో వరి ధాన్యం ఎండకా రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు వర్షం కురవడంతో వడ్లన్నీ ఒకచోట పేర్చి టార్పాలిన్ కవర్లను ఆ ధాన్యంపై కప్పి ఉంచారు. వర్షం వస్తూ పోతూ ఉండటంతో రైతులు తమ ధాన్యాన్ని ఆరబోస్తూ.. ఒకచోట చేరుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. మరో 4, 5 రోజులైతే వరి ధాన్యం తూకం మొత్తం పూర్తయ్యేదని, ప్రస్తుతం వర్షం కురవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెబుతున్నారు.

ఆంధ్రాలో మిచౌంగ్ తుఫాను ప్రభావంతో కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు.. అక్కడక్కడ వర్షం కురిసింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ ధాన్యాన్ని త్వరగా తూకం వేసి తరలించాలని రైతులు కోరుతున్నారు.



వర్షం కురవడంతో కప్పి ఉంచిన ధాన్యం

నాటు ఆలస్యమైంది

తాను వరి నాటు వేయడం ఆలస్యమైందది. దీంతో తమ పంట చేతికి రావడం ఆలస్యమైంది. మరో రెండు మూడు రోజులు అయితే తమ పంట అమ్మకం జరిగేది. గత రెండు రోజులుగా వరి ధాన్యాన్ని ఆరబెడుతూ, వర్షానికి తడవకుండా ఉంచుతున్నాం. వర్షం పడటంతో ఇబ్బందులు పడుతున్నాం.
- రైతు మల్లయ్య, రామేశ్వర్‌పల్లిఓ

ఘనంగా శ్రీ కాలభైరవ స్వామి వేడుకలు

- ఆకట్టుకున్న ఎడ్లబండ్ల ప్రదర్శ సందర్శన



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలో శ్రీ కాలభైరవ స్వామి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా మంగళవారం స్వామివారికి ఉదయం సంతతదారాభిషేకం, మధ్యాహ్నం సింధూర పూజ, డోలారోహణ (తొట్లే జన్మదినం), భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం ఎడ్లబండ్ల ప్రదర్శ సందర్శన ఆకట్టుకుంది. రాత్రి భద్రకాళి పూజ, పల్లకి సేవ, రాత్రి ఒగ్గు కథ తదితర కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వహించింది. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల తాకిడితో ఆలయం కిటకిటలాడింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, శాంతి భద్రతల దృష్ట్యా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ప్రభు రామచంద్రం, పూజారులు శ్రీనివాస్ శర్మ, మనీష్ శర్మ, సిబ్బంది సురేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



అవే ఓటమికి కారణం..?

- ఇండ్లు నిర్మించుకున్నా లబ్దిదారులకు అందని బిల్లులు
- దళితబంధులో కమీషన్లు
- అర్హులకు అందని పలు పథకాలు
- దాంతో లబ్దిదారుల్లో అసంతృప్తి
- అవే ఓటమికి కారణమంటున్న రాజకీయ విశ్లేషకులు

పలు పథకాలు ప్రజలకు అందకపోవడంతోనే జుక్కల్ బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే ఓటమికి కారణమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ప్రధానంగా దళితబంధు, బీసీ బంధు లబ్దిదారులు ఎక్కువగా ఉన్నా.. అవి పూర్తిస్థాయిలో వారికి అందలేదు. ఇవే కాక ఇలాంటి మరెన్నో పథకాలతో బీఆర్ఎస్‌కు ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడింది. తద్వారా ఓటమికి కారణమైందని ఇటు ప్రజలు, అటు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

-నవతెలంగాణ, నిజాంసాగర్

డబుల్ బెడ్రూమ్ ఇండ్లు..

నిజాంసాగర్ మండలంలోని 220 మంది లబ్దిదారులు డబుల్ బెడ్‌రూం ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో అర్హులైన 170 మందికి ఎంపిక చేసి మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో ఆ లబ్దిదారులు అప్పులు చేసి మరీ గృహ నిర్మాణం చేపట్టారు. బిల్లుల కోసం చూడగా వారికీ నిరాశ ఎదురైంది. సంవత్సరం గడిచినా బిల్లులు రాకపోవడంతో ఆ లబ్దిదారులు మానసికంగా, ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డారు. కొందరైతే తమ పంట పొలాలను సైతం అమ్ముకున్నారు. లబ్దిదారులు బిల్లుల కోసం గ్రామాలలోని నాయకులకు అడగగా.. వారు పట్టించుకోకపోవడంతో ప్రజల్లో బీఆర్ఎస్ పట్ల వ్యతిరేకత ఏర్పడిందని ప్రజలు అంటున్నారు.

దళిత బంధు..

పైలట్ ప్రాజెక్టులో భాగంగా నిజాంసాగర్ మండలాన్ని మాజీ సీఎం కేసీఆర్ దళిత బంధు పథకానికి ఎంపిక చేశారు. కానీ దానిలో కొంతమంది నాయకులు చేతివాటం ప్రదర్శించారని ఆరోపణలు దళితుల నుంచి చాలా వచ్చాయి. ఒక్కో లబ్దిదారునికి ఒక్కో యూనిట్ చొప్పున అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక్కో యూనిట్‌కి పది లక్షలు అందజేయాలని నిర్దేశించింది. ఈ పది లక్షలతో లబ్దిదారుడు తనకు అవసరమైన పనిముట్లను, లేదా ఏదైనా వ్యాపారానికి సంబంధించిన యూనిట్‌ను ఏర్పాటు చేసుకునే వీలు కల్పించారు. అయితే మంజూరైన రూ.10లక్షల యూనిట్ నుంచి రూ.2 నుంచి 3 లక్షల వరకు స్థానిక నేతలు కమీషన్ తీసుకొని లబ్దిదారులకు మిగతా డబ్బులు ఇచ్చారని లబ్దిదారుల నుంచి ఆరోపణలు వచ్చాయి. కొందరు లబ్దిదారులకు తమకు అవసరం ఉన్న పనిముట్లు ఇవ్వక నాయకులు ఎంపిక చేసిన పనిముట్లనే తీసుకోవాలని ఒత్తిడి తెచ్చారని.. ఒకవేళ తీసుకోకపోతే దళితబంధు మొత్తం ఇవ్వకుండా చేస్తామని బెదిరింపులకు గురిచేశారని లబ్దిదారులే ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్ వరకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకం మంజూరులో అధికారుల అలసత్వం.. స్థానిక నేతలు కక్కుర్తి పడి కమీషన్లు తీసుకోవడంతో బీఆర్ఎస్ అభ్యర్థికి తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందనేది తెలుస్తోంది.

బీసీ బంధు..

చేతివృత్తుదారులకు రూ.లక్ష ఆర్థికసాయం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ బంధును ప్రవేశపెట్టింది. దీని ద్వారా చేతివృత్తులు తగు అవసరాల కొరకు ఉపయోగపడే పనిముట్లను కొనుగోలు చేసుకోవడానికి ఉపయోగపడుతుందని ఈ పథకం ప్రవేశపెట్టారు. కానీ దీనిని అసలైన చేతివృత్తిదారులకు ఇవ్వకుండా కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే ఇచ్చారని పలు గ్రామాలలోని చేతివృత్తిదారులు ఆరోపించారు. ఎంపిక విషయంలో మండలంలోని నాయకులకు అప్పచెప్పడం వల్ల వాళ్లు కేవలం కార్యకర్తలనే ఈ పథకంలో భాగంగా ఎంపిక చేయడంతో మిగతా అర్హులు నిరాశకు గురయ్యారు. వందల మంది ఇందుకుగానూ దరఖాస్తు చేసుకుంటే కేవలం కొంతమందికే ఆర్థికసాయం అందజేశారు. తద్వారా బీఆర్ఎస్ పట్ల ఆ లబ్దిదారులు ఆగ్రహంతోనే ఉన్నారు.

అధికార యంత్రాంగం..

మండల కేంద్రంలోని అధికారుల వ్యవస్థ మొత్తం నాయకుల చేతిలో ఉండిపోయిందని మండల కేంద్రంలోని ప్రజలు ఎప్పటి నుంచో ఆరోపిస్తున్నారు. ఏ పని కోసం వెళ్లినా.. తగు నాయకుడు చెబితేనే ఆ పనిని చేసేవారని ప్రజలు పేర్కొన్నారు. పలు పనులను అమలు చేయడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ప్రజలు చెబుతున్నారు.

ఎమ్మెల్యేపైనా తీవ్ర వ్యతిరేకత..

జుక్కల్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి హనుమంత్ షిండే గత ఎన్నికల గెలుపు అనంతరం మళ్లీ ఎన్నికల ప్రచారం వరకు ఏ గ్రామానికి వచ్చి సమస్యలపై ఆరా తీయలేదని ప్రజలు పేర్కొంటున్నారు. కేవలం మండల నాయకులు మాత్రమే పాలన సాగించారని ఏదైనా అవసరం ఉండి ఎమ్మెల్యే దగ్గరికి వెళితే 'మీ మండల నాయకునికి దగ్గరికి వెళ్లండి' అని స్వయంగా ఎమ్మెల్యేనే చెప్పేవాడని, దీని ద్వారా సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని పలు గ్రామాలలోని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీని ద్వారా కూడా హన్మంత్‌షిండేకు తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది.

కామారెడ్డిలో మొదటిసారి బీజేపీ

- ఇద్దరు ఉద్దండులపై గెలిచిన కాటిపల్లి వెంకట రమణారెడ్డి

నవతెలంగాణ-భిక్కనూర్



బిజెపి పార్టీ ఏర్పడిన 43 సంవత్సరాల తర్వాత మొట్టమొదటిసారిగా కామారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యేగా కాటెపల్లి వెంకట రమణారెడ్డి గెలుపొందారు. చరిత్రను తిరగరాస్తూ అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ బీజేపీ జెండా కామారెడ్డిలో ఎగురవేశారు.

కామారెడ్డి పట్టణం, రామారెడ్డి, మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట్, భిక్కనూరు, రాజంపేట్ మండలాలు కామారెడ్డి నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. 1952 సంవత్సరం నుంచి 2023 వరకు కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం పార్టీ, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు గెలుపొందారు. 1980లో బిజెపి పార్టీ ఆవిర్భవించింది. ఆ తరువాత ఒక్కసారి కూడా బిజెపి నుంచి ఇక్కడ ఒక్కరు కూడా ఎమ్మెల్యేగా గెలుపొందలేదు.

1952-57 విటల్‌రెడ్డి (కాంగ్రెస్), రామారావు(కాంగ్రెస్), 1957- 62 సదాలక్ష్మి (కాంగ్రెస్), 1962-67 రమణారెడ్డి (కాంగ్రెస్), 1967-72లో ఇండిపెండెంట్ అభ్యర్థి ఎం.రెడ్డి, 1972-78 సత్యనారాయణ (కాంగ్రెస్), 1978-83లో బాలయ్య (కాంగ్రెస్), 1983-85 గంగయ్య (తెలుగుదేశం పార్టీ), 1985-89 కృష్ణమూర్తి (తెలుగుదేశం), 1989-94 షబ్బీర్‌అలీ (కాంగ్రెస్), 1994-99 గంప గోవర్ధన్ (తెలుగుదేశం), 1999-2004 యూసుఫ్ అలీ (తెలుగుదేశం), 2004-09 మహమ్మద్ షబ్బీర్ అలీ (కాంగ్రెస్), 2009-12 గంపగోవర్ధన్ (తెలుగుదేశం), 2012-14 గంప గోవర్ధన్ (టిఆర్ఎస్), 2014-18 గంప గోవర్ధన్ (టిఆర్ఎస్), 2018-23 గంప గోవర్ధన్ (టిఆర్ఎస్) గెలుపొందారు.


తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల కాలంలో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలలో కామారెడ్డి నియోజకవర్గం నుంచి ఇద్దరు ఉద్దండులు బిఆర్ఎస్ నుంచి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, కాంగ్రెస్ నుండి రేవంత్‌రెడ్డి, బిజెపి నుండి వెంకట రమణారెడ్డి పోటీ చేశారు. ఈసారి కూడా ఇద్దరు సీఎం అభ్యర్థులలో ఎవరో ఒకరు గెలుపొందడం ఖాయమని, బిజెపి పార్టీ అభ్యర్థి వెంకట రమణారెడ్డి గెలుపు కష్టమని అందరూ భావించారు. కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్‌పై దూషణలు, బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీపై దూషణలు చేసుకున్నారే తప్ప బిజెపి అభ్యర్థిని పట్టించుకోలేదు. అసలు తమకు బిజెపి పార్టీ పోటీనే కాదని ఒకరికొకరు ఆరోపణలు చేశారు. అయితే చాప కింద నీరులా ఇద్దరి మధ్యలో కామారెడ్డి నియోజకవర్గంలో గత చరిత్రను తిరగరాస్తు సీఎం అభ్యర్థులకు షాక్ ఇవ్వడమే కాకుండా మొట్టమొదటిసారిగా కామారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ జెండాను వెంకట రమణారెడ్డి ఎగురవేశారు.

శాస్త్ర సాంకేతికతో అన్ని రంగాల్లో ముందడుగు

- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

శాస్త్ర సాంకేతిక రంగాన్ని భవిష్యత్ తరానికి అందించినప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందడుగు వేస్తుందని, అందుకు ఈ మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడానికి ఉపయోగపడతాయని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వ ర్యంలో యూనివర్సిటీ లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో జన్యు శాస్త్రంలో మార్పులు- ఆరోగ్య రంగంపై ప్రభావం అనే అంశంపై మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్. ఎం యాదగిరి పాల్గొని రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభిం చారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ ఎం.యా దగిరి మాట్లాడు తూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఆధ్వర్యంలో యువ సైంటిస్టులను తయారుచేసే మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ జీన్ హెల్త్ కనెక్ట్ నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా సీసీఎంబి హైదరాబాద్, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రి యల్ టెక్నాలజీ మ్యూజియం రిసోర్స్ పర్సన్స్ మానవ ఆరోగ్యానికి జన్యులతో ఉన్న నిర్మాణ సంబంధాన్ని కళ్లకు కట్టినట్టుగా విద్యార్థులకు వివరించారు. ఈ ప్రదర్శనలో 20 రకాల జెన్యూ నమూనాలు, వీడియోలు విద్యార్థులను శాస్త్రీయంగా ఆలోచించే విధంగా ఉన్నాయని తెలిపారు. ఈ మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్లో ఎస్-ఎస్ఆర్ డిగ్రీ కాలేజ్, జెడ్‌పిహెచ్‌ఎస్ సుద్దపల్లి, వందేమాతరం, ప్రెసిడెన్సి, విక్టరీ, కృష్ణవేణి టాలెంట్ తదితర పాఠశాలల నుండి సుమారుగా 800 మంది విద్యార్థులు పాల్గొని ప్రశ్నలు అడిగి అవగాహన పొందారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ హారతి, బయోటెక్నాలజీ విభాగతిపతి డాక్టర్ జువేరియ ఉజ్మ, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ మామిడాల, డాక్టర్ మహేందర్ రెడ్డి, డాక్టర్ కిరణ్మయి డాక్టర్ ప్రసన్న షీలా, డాక్టర్ ప్రసన్న, రమేష్ నాయక్ మలవత్, సూపరిన్టెంట్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి సీఎం ప్రకటనతో నాయకుల హర్షం

నవతెలంగాణ-భిక్కనూర్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ పార్టీ టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పేరును కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించడంతో మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షులు భీమ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో బందీగా ఉన్న తెలంగాణ రాష్ట్ర బానిస సంకెళ్లను తెంచిన టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ముఖ్యమంత్రి చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సోనియా గాంధీ, రాహుల్‌గాంధీకి రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాల్‌రెడ్డి, అంకం రాజు తదితరులున్నారు.



హర్షం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
బుధవారం | డిసెంబర్ 6, 2023 | www.navatelangana.com

50 శాతం రాయితీపై బస్సు పాసులు పంపిణీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అర్హులైన వికలాంగులందరికీ 50 శాతం రాయితీ పై బస్సు పాసులు అందజేసినట్లు రవీందర్ రెడ్డి మంగళవారం తెలిపా రు. మండలంలోని ఐకెపి కార్యాల యంలో జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన తాళ్ల గంగాధర్‌కు వికలాంగుల బస్సు పాసు 50 శాతం రాయితీపై ఉన్నటువంటి ఆర్టీసీ బస్సులో రాష్ట్ర మంతట ప్రయాణించేందుకు ఇచ్చిన ట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల వికలాంగుల సిసి శ్రీరామ్, మండలంలోని ఆరుగురు కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, మండల సమైక్య సిబ్బంది పాల్గొన్నారు.


బస్సు పాసులు అందజేత

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

నవతెలంగాణ-బాల్కొండ

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రమేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులు చికిత్స తీసుకునేలా ఆరోగ్య సిబ్బంది వారికి అవగాహన కల్పించాలని కోరారు. ఆస్పత్రిలోని మందుల నిల్వలు, శస్త్ర చికిత్సల తీరు, ఓపి రిజిస్టర్లను పరిశీలించారు. రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాకేష్, సబ్ యూనిట్ ఆఫీసర్ మురళి, హెచ్ఈఓ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.


ఆస్పత్రిని తనిఖీ చేసిన వైద్య ఆరోగ్యశాఖ అధికారి రమేష్

పంతం పట్టాడు..
షకీల్‌ను ఓడించాడు..

- అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలే ఓటమికి కారణమా?
- సహకరించని శరత్ రెడ్డితో విభేదాలు!
- షకీల్ ఓటమి టార్గెట్‌గా కృషి
- పంతం నెగ్గిన శరత్ రెడ్డి
- కాంగ్రెస్‌కు కలిసి వచ్చిన లక్కీ లెగ్
- కాపాడని కవిత


పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-నవీపేట్

బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమీర్ అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలే ఓటమికి కారణాలని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. బోధన్ నియోజకవర్గంలో రెండు లక్షల ఇరవై రెండు వేల ఓట్లు ఉండగా అందులో మైనార్టీలవి సుమారు 65వేలు ఉన్నాయి. అందులో కచ్చితంగా 50వేల ఓట్లు తన వర్గం నుండి వస్తాయని మహమ్మద్ షకీల్ మొదటి నుండి అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. దానికి తోడు ఆయన అనుచర గణం సైతం మండలాల్లో అరాచకాలు సృష్టించడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది.

బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న తూము పద్మ శరత్ రెడ్డితో భూ ఆక్రమణల విషయమై సహకరించకపోవడంతో షకీల్, శరత్ రెడ్డిల మధ్య పచ్చగడ్డి వేస్తే కాలే పరిస్థితి ఏర్పడిందని, దీనికి తోడు బోధన్ పట్టణంలోని ఎంఐఎం కౌన్సిలర్లపై అక్రమ కేసులు నమోదు చేయడంతో శరత్ రెడ్డికి వారు మద్దతు పలికారు. దీంతో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శరత్ రెడ్డి మాతృమూర్తి తూము శివమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని గ్రామాల్లో నిరుపేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయడంతో నియోజకవర్గంలో మంచి పేరును సంపాదించారు. షకీల్ ఓటమి టార్గెట్‌గా సుమారు పదివేల బోగస్ ఓట్ల తొలగింపుతో పాటు గత ఎన్నికల్లో కంటే బీఆర్ఎస్‌కు మెజార్టీగా మైనార్టీ ఓట్లు పడకుండా అడ్డుకట్ట వేయడంలో కొంతమేర విజయమే సాధించారు. గత ఎన్నికల్లో బోధన్ పట్టణంలో భారీ మెజార్టీ రావడంతోనే మహమ్మద్ షకీల్ అమీర్ గెలుపొందారు. కాబట్టి ముందస్తు జాగ్రత్త చర్యగా కావలసినంత మెజార్టీ రాకుండా అన్ని చర్యలు చేపట్టారు. కేవలం పట్టణంలోనే 69,997 ఓట్లు ఉండగా 69 శాతం పోలింగ్ జరిగింది. అందులో 50శాతం ఓట్లు 23,890 అతి కష్టంతో బిఆర్ఎస్ పార్టీ సాధించి కాంగ్రెస్‌పై 8649 మెజార్టీ సాధించారు. రెంజల్ మండలంలో సైతం కాంగ్రెస్‌పై 289 మెజార్టీ సాధించారు. కాంగ్రెస్ పార్టీ బోధన్ రూరల్‌లో 4127, సాలూరలో 2498, నవీపేట్‌లో 3791, ఎడపల్లిలో 1291 మెజార్టీని బిఆర్ఎస్ పార్టీపై సాధించింది. అందులో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు బిజెపికి 321, బిఆర్ఎస్ కు 237, కాంగ్రెస్‌కు 530 వచ్చాయి. దీంతో మొత్తం 3062 ఓట్లతో షకీల్ అమేర్‌పై మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి గెలిచారు.

విభేదాలతోనే విజయానికి దూరం...

ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌తో పాటు ఆయన సెకండ్ క్యాడర్ నియోజకవర్గంలో అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడడంతోనే అతి స్వల్పంగా 3062 ఓట్లతో ఓడిపోవాల్సి వచ్చిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సెకండ్ క్యాడర్ నాయకుల ఆగడాలు మితిమీరి పోవడంతో వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలంటే షకీల్ ఓటమితోనే సాధ్యమవుతుందని భావించి కాంగ్రెస్‌ను గెలిపించేందుకు బాధితవర్గం శాయశక్తులా కృషి చేసింది.

కాంగ్రెస్‌కు లక్కీ లెగ్‌గా శరత్ రెడ్డి

గతంలో కాంగ్రెస్ పార్టీకి చిన్నపాటి విభేదాలతో దూరమైన తూము శరత్ రెడ్డి కుటుంబం 2014, 2018 ఎన్నికల్లో షకీల్ ఆమేర్‌కు మద్దతు తెలపడంతో రెండుసార్లు గెలిచారు. 2023 ఎన్నికల్లో ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు దూరమై కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికి మద్దతు తెలుపడంతో ఆయన స్వల్ప మెజార్టీతో గట్టెక్కారు. దీంతో శరత్ రెడ్డి బోధన్ నియోజకవర్గంలో లక్కీ లెగ్‌గా మారారు.

పంతం నెగ్గించుకున్న శరత్ రెడ్డి..

ఎమ్మెల్యే షకీల్ భూకబ్జాల ఆగడాలకు మున్సిపల్ చైర్ పర్సన్ గా తూము పద్మశరత్ రెడ్డి సహకరించకపోవడంతోనే మొదలైన విభేదాలు చివరకు ఎమ్మెల్సీ కవిత సర్వశక్తులతో కృషిచేసిన షకీల్ అమేర్‌ను ఓటమి పాలు చేశాయి. రాష్ట్రంలో కాంగ్రెస్‌వేవ్ ఉండడం మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డిపై ప్రజలలో సానుకూలత ఉండడంతో కాంగ్రెస్ భారీ మెజార్టీతో గెలుస్తుందని అందరూ భావించారు. కానీ మహమ్మద్ షకీల్ అమీర్ మొదటినుండి వ్యతిరేక ఓటు చీల్చేందుకు తనకు బిజెపితోనే పోటీ అని ప్రచారం చేశారు. బిజెపి పార్టీకి వ్యతిరేక ఓటు పెద్ద మొత్తంలో వెళితే తన గెలుపు సునాయాసం అవుతుందని భావించారు. బోధన్ నియోజకవర్గంలో బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి వడ్డీ మోహన్ రెడ్డితో పాటు మేడపాటి ప్రకాశ్ రెడ్డి సైతం ప్రజలలోకి విస్తృతంగా ప్రచారం చేయడం,

బిజెపికి 20వేల ఓట్లపైగా సాధిస్తే తమకు ఎంతో కలిసొస్తుందని భావించిన 33555 ఓట్లు వచ్చినా బీఆర్ఎస్‌కు చుక్కెదురైంది. బోధన్‌లో ఓటర్లకు ఎటువంటి ప్రలోభాలకు గురిచేయకున్నా బిజెపికి ఊహించనంత ఓట్లు సాధించడంతో అందరూ ఆశ్చర్యపోయారు. దీంతో పెద్ద మొత్తంలో కాంగ్రెస్ ఓటుకు గండి పడినట్లయింది. శరత్ రెడ్డి బోధన్ పట్టణంతోపాటు నియోజకవర్గంలో ఓట్లు పడేందుకు కృషి చేయడం దానికి తోడు కాంగ్రెస్ శ్రేణులు తోడవడంతో చివరకు స్వల్ప ఓట్ల మెజార్టీతో గెలవడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు.

శంకర్‌కు ఉత్తమ కవిత పురస్కారం


ఉత్తమ కవిత పురస్కారం అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రాథమిక ఆరోగ్యం ఇందలవాయిలో ఆరోగ్య విస్తరణ అధికారిగా పనిచేస్తున్న యెనుగందుల శంకర్‌కు సన్మానించారు. రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం నగరంలోని నవ్య భారతి గ్లోబల్ స్కూల్ ముబారక్ నగర్‌లో హరిదా రచయితలసంఘం ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి కవితా సమ్మేళనంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్వాయిలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఆరోగ్య విస్తరణ అధికారి వైశంకర్ పాల్గొన్నారు. 'పోగు కొక్క చెమట చుక్క' అనే శీర్షికన చేనేత కార్మికుల కష్టాలను కళ్లకద్దినట్లు కావ్య రూపంలో రచించినందుకు గాను ఉత్తమ కవిత పురస్కారం పొందారు. విజయ్ విద్యాసంస్థల అధినేత అమృత లత చేతుల మీదుగా సన్మానం చేశారు. గతంలో వై.శంకర్ కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ కవిత పురస్కారానికి అవార్డులు అందుకున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జడ్పీ చైర్ పర్సన్ దాదన్న గారి విఠల్ రావు, జిల్లా డిప్యూటీ కలెక్టర్, నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్ నీతు కిరణ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. హైదరాబాదులోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ కవితా పురస్కారానికి సన్మానం పొందారు. హైదరాబాద్‌లోని బిర్లా ప్లాంటేరియంలో జరిగిన కార్యక్రమంలో కూడా ఉత్తమ కవిత పురస్కారానికి రాష్ట్రస్థాయిలో ఎన్నికై సన్మానం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమారుడు ప్రభాకర్ రావు చేతుల మీదుగా పొందినట్లు వివరించారు.

మగ్గిడి పాఠశాలకు కుర్చీల వితరణ



రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో పాఠశాలకు కుర్చీల అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మగ్గిడి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలకు కుర్చీలు వితరణ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పట్వారి గోపి కృష్ణ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులకు తమ వంతు సేవలు ఎల్లప్పుడు ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిత మాట్లాడుతూ రోటరీ సేవలు ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో కోశాధికారి లక్ష్మీనారాయణ ,ప్రాజెక్టు చైర్మన్ స్పాన్సర్ కోట నరేష్, రోటరీ సభ్యులు శశిధర్ పాఠశాల ఉపాధ్యాయులు కిషన్, అనిల్ , విద్యార్థులుతదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పీజీ సీట్లను భర్తీ చేయాలి

- పిడిఎస్‌యూ



రిజిస్ట్రార్ ప్రొఫెసర్‌కి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యు నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న 200 పీజీ సీట్లను వేంటనే భర్తీ చేయాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం పిడిఎస్‌యూ యూనివర్సిటీ కమిటి ఆధ్వర్యంలో పారిపలన భవనం ముందు ధర్నా నిర్వహించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీలో 2023 -24 విద్యా సంవత్సరంలో పిజి అడ్మిషన్లలో అన్ని కోర్సులలో కలిపి 200 సీట్లు మిగిలిపోయాయని అన్నారు. కొన్ని కోర్సుల్లో సగం సీట్లు మాత్రమే నిండుతున్నాయని, దానివల్ల కోర్సులు ఎత్తివేసే అవకాశం ఉందని తెలిపారు. ఏటా వందల సంఖ్యలో సీట్లు మిగిలిపోతున్నాయని, స్పాట్ కౌన్సిలింగ్ లేదా మరొక కౌన్సిలింగ్ ద్వారా అయినా పీజీ సీట్లను భర్తీ చేసి గ్రామీణ పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు శివసాయి, ఆకాష్, హన్మాండ్లు, అశ్విత్, తరుణ్, రాము, రాజు, మన్యం కొండ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల ర్యాలీ

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బోర్గం(పి) చౌరస్తా నుండి ఎల్లమ్మ కుంట తండా వరకు మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ దాదాపు పది సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, తెలంగాణ ఇచ్చిన పార్టీ తెలంగాణను అభివృద్ధి చేసే పార్టీ కూడా కాంగ్రెస్ పార్టీ అన్నారు. కార్యకర్తలు రాత్రి అనక పగలనకా కష్టపడ్డందుకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. కచ్చితంగా రైతులకు, నిరుపేదలకు మంచి రోజులు వచ్చాయని ఆయన తెలిపారు. దాదాపు పది సంవత్సరాల కాలంలో తనతో పాటు మరికొంత మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు బీఆర్ఎస్ ప్రభుత్వం వేధింపులకు గురిచేసిందని, భయపడకుండా పోరాడుతూ ఎదిరించామని అన్నారు. బీఆర్ఎస్ పాలనపై ప్రజలు చాలా విరక్తి చెందారని ఏ పథకంలో, సంక్షేమంలో కమిషన్లు ఇచ్చేంతవరకు పేదవాడికి ఆ పథకం లబ్ధి పొందలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సమన్యాయ పాలన ఉంటుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మండల అధ్యక్షుడు బున్నె రవి పాల్గొన్నారు.

ప్రతి గర్భిణిని 12 వారాల్లోపు నమోదు చేయాలి

- లేదంటే నమోదు కష్టం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రతి గర్భిణీ స్త్రీని 12 వారాలలోపు నమోదు చేయాలని, 12 వారాలు దాటితే నమోదు చేయడం కష్టమవుతుందని డాక్టర్ సంతోష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఆరోగ్య ఉప కేంద్రంలో జరుగుతున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. గర్భిణి స్త్రీలకు న్యూట్రిషన్ కిట్ కుడా ఇవ్వడం కష్టమవుతుందని వివరించారు. ప్రసవం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి

తీసుకొని రావాలని, అంగన్వాడి కేంద్రాల్లో ప్రతి గర్భిణీ స్త్రీ కి పూర్తిస్థాయి పౌష్టికాహారం అందేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం అయిన బాలింతను తీసుకెళ్లి గర్భిణీ స్త్రీలకు ప్రోత్సాహం చేయించాలని తెలిపారు. అసంక్రమిత వ్యాధులైన హైపర్ టెన్షన్, డయాబెటిస్ లాంటి వ్యాధులకు తీసుకోవలసిన మందులు ప్రభుత్వాసుపత్రిలోనే తీసుకోవాలని, తీసుకునేలా ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది చుడాలని వివరించారు. ప్రైవేటు ఆస్పత్రిలో ఈ వ్యాధులకు మందులు తీసుకుంటున్న వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో తీసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికూన్ గున్య, దోమ కాటు వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రతి గ్రామంలో నీరు నిల్వగల ప్రాంతాలను గుర్తించి గ్రామ పంచాయతీ సెక్రటరీకి నివేదించాలని అన్నారు. గ్రామపంచాయతీద్వారా దోమల నివార ణ మందులను స్ప్రే చేయించాలని పేర్కొన్నారు. చలికాలంలో విస్తృతంగా వ్యాపిస్తున్న క్షయ వ్యాధి నివారణకు తీసుకోవలసిన చర్యల గురించి వివరిం చారు. క్షయ వ్యాధి నిర్ధారణకు తెమడ పరీక్షకు ప్రతి ఒక్కరు ప్రభుత్వ ఆసుపత్రికి సాంపుల్స్ పంపించా లని తెలిపారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ ఆరోగ్య పర్యవేక్షులు అక్బర్ అలీ, ఆరోగ్య కార్యకర్తలు వెంకటరెడ్డి, ఆనంద్, ఫార్మసిస్ట్ విజయలక్ష్మి ,ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్

న్యూట్రిషన్ కిట్లు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అర్హులైన గర్భవతులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య మహిళ ప్రోగ్రాం నిర్వహించి న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ... గర్భవతులు పౌష్టికాహార లోపాన్ని నివారించడానికి తెలంగాణ ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఫాతిమా, ఆరోగ్యశాఖ అధికారులు కృష్ణమూర్తి, ఆంద్రూస్, సాయి, చంద్రశేఖర్, స్వరూప, రజిత, సంధ్య ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


గర్భిణులకు కిట్ల అందజేత

యాజమాన్యం చర్చలు జరపాలని ధర్నా

- బార్దాన్ వర్కర్స్ యూనియన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

బార్దన్ కార్మికుల కూలి రేట్లు పెంచాలని కార్మికులు గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ ద్వారం వద్ద నిరసన వ్యక్తం చేసి కార్మిక శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బార్దాన్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు మల్యాల గోవర్దన్ మాట్లాడుతూ.. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కూలి రేట్ల పెంపు ఒప్పందం జరుగుతుంటే, ఈసారి యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తూ కూలి రేట్లు పెంచబోమని తెలపడంతో కార్మికులు సమ్మె చేస్తున్నారని అన్నారు, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని, యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలని అన్నారు, బార్దాన్ కార్మికుల సమ్మె విరమణకు కార్మిక శాఖ అధికారులు చొరవ చూపి, చర్చలు జరిపి కూలి రేట్లు, ఇతర డిమాండ్లను పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు దండే రాము, నాయకులు అబ్దుల్, విజయ్, రాజు, సురేష్, గంగాధర్, కరుణబాయి, భారతి మరియు బార్దన్ కార్మికులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బార్దాన్ వర్కర్స్ యూనియన్

ఇరిగేషన్ స్థల ఆక్రమణపై విచారణ


ఇరిగేషన్ స్థలం కొలతలు నిర్వహిస్తున్న అధికారులు

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని బాసర మూలమలుపు వద్ద ఇరిగేషన్ కాలువ స్థలంపై నివాసగృహం నిర్మాణంపై ఇరిగేషన్ ఏఈ శ్రీధర్ మంగళవారం విచారణ చేపట్టారు. వార్డు సభ్యురాలు శోభ ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇరిగేషన్ స్థలాన్ని కొలతలు నిర్వహించారు. గృహ నిర్మాణం ఇరిగేషన్ స్థలంలోనే ఉందని నోటీసు జారీ చేశారు.

నూతన ఎమ్మెల్యేను కలిసిన వైద్యులు


ఎమ్మెల్యేను కలిసిన వైద్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన పైడి రాకేష్ రెడ్డిని మంగళవారం పట్టణ ఆసుపత్రి సూపరిండెంట్ నాగరాజు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సుమంత్ ,అమృత్ రాంరెడ్డి, రవి ,ప్రవీణ్, శ్రీకాంత్, పల్లవి, స్నేహ, ఆశ హాస్పిటల్ వైద్యులు శేఖర్ రెడ్డి, తదితరులు కలిశారు.

రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వేణుగోపాల్ యాదవ్



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ కాబోయే ముఖ్యమంత్రి, పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డిని మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన పిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని హోటల్ ఎల్లాలో రేవంత్ రెడ్డిని కలిసి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చినందుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో సత్కరించారు. పది సంవత్సరాలు కార్యకర్తల పోరాట ఫలితంతో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో కష్టపడ్డ ప్రతి నాయకునికి భవిష్యత్తు ఉంటుందని రేవంత్ రెడ్డి చెప్పినట్లు వేణుగోపాల్ యాదవ్ తెలిపారు.

ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావుకు మంత్రి పదవి ఇవ్వాలి



నవతెలంగాణ-నిజాంసాగర్

జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుకు మంత్రి పదవిని ఇవ్వాలని నిజాంసాగర్ యువజన కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మల్లయ్య గారి ఆకాష్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గానికి ఇప్పటివరకు ఏ ఒక్క ఎమ్మెల్యేకు కూడా మంత్రి పదవి ఇవ్వలేదని, దీని ద్వారా నియోజకవర్గం విద్యలో గాని వైద్యంలో గాని అభివృద్ధిలో గానీ వెనుకబడి ఉందని ఆయన అన్నారు. లక్ష్మీకాంతరావుకు మంత్రి పదవి ఇస్తే జుక్కల్‌ను నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారని ఆయన హామీ ఇచ్చారు. కావున అధిష్టానం ఆలోచించి ఒక్కసారి నియోజకవర్గానికి మంత్రిని ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో ఆధార్ సెంటర్ ప్రారంభం



నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణంలోని స్థానిక అంగడిబజార్ సమీపంలో బిఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో ఆధార్ సెంటర్ ప్రారంభించినట్లు బిఎస్ఎన్ఎల్ అధికారులు తెలిపారు. నూతన ఆధార్ కార్డు కొరకు, ఆధార్ కార్డులోని తప్పులను సవరణ కొరకు ఆధార్ సెంటర్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యాలయం తెరిచి ఉంటుందని తెలిపారు. మండల ప్రజలు నూతన ఆధార్ సెంటర్ సేవా కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శనగ పంటకు తెగుళ్లు..

- వాతావరణ మార్పులతో చీడపురుగుల బెడద
- ఆందోళనలో రైతులు



నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలంలో అత్యధికంగా సాగుచేసిన శనగ పంటకు ఎండు తెగుళ్ల బెడద అధికంగా కనిపిస్తుంది. ఇదిలా ఉండగా మరోపక్క గత రెండు రోజులుగా వాతావరణంలో పూర్తిగా మార్పు కనిపించడంతో చీడపురుగుల బెడద పంటలపై అధికమవుతుందని మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రబీ పంట సాగులో భాగంగా మండలంలో శనగ పంట అత్యధికంగా వేశారు. ఈ పంటకు ఎండు తెగుళ్ల రావడంతో పంట చనిపోతుంది. ఎండు తెగుళ్ల నివారణ కోసం పురుగు మందులు పిచికారి చేసినప్పటికీ వాతావరణం చల్లగా మబ్బులు పట్టి ఉండడం, చిరుజల్లులు కూడా ఉంటడంతో అన్ని రకాల పంటలపై చీడపురుగుల బెడద అధికమైందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో మార్పులతో మబ్బులు చల్లగా ఉండడం పంటలపై చూపిన చీడపురుగుల నివారణ కోసం పిచికారి మందులు కూడా వాడలేని పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. పురుగుల నివారణ కోసం వాతావరణం ఎండగా ఉంటేనే పురుగులు నివారించుకోవచ్చని వాతావరణ మబ్బులుగా ఉండి చల్లటి వాతావరణంతో దోమ లాంటి వర్షం కురిసే అవకాశం ఉన్నందున మందులు పిచికారీ చేయలేని పరిస్థితి నెలకొంది. చీడపురుగుల బెడదతో పంటలు పెద్ద మొత్తంలో నష్టపోతున్నాయని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంది పంటపైన, శనగ పంట పైన పురుగుల బెడద అధికంగా ఉన్నట్లు రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం ఇలాగే ఉంటే పంటలు భారీగా నష్టపోయే అవకాశాలున్నాయని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటు ఎండు తెగుళ్ల నివారణ కోసం అటు మబ్బులతో చల్లటి వాతావరణం నెలకొనడం చీడపురుగుల బెడద అధికం కావడం తెగుళ్ల నివారణ చీడపురుగుల నివారణ కోసం వ్యవసాయ శాఖ అధికారులు ఇలాంటి పరిస్థితుల్లో పంటలు కాపాడుకునేందుకు సలహాలు సూచనలు అందించి రైతన్నలకు ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

సాటాపూర్ చౌరస్తాలో కుక్కల స్వైర విహారం

- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు
- ఇటీవల ముగ్గురు చిన్నారులపై దాడి



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గత మూడు రోజుల కిందట ముగ్గురు చిన్నారులపై దాడి చేశాయి. స్థానిక గ్రామపంచాయతీ అధికారులు గాని, సంబంధిత శాఖ అధికారులు కుక్కల నివారణ కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ఉండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-పిట్లం

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన మండలంలోని గోడమేగావ్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గోడమేగావ్ గ్రామంలో మంగళవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో గ్రామ శివారులోని ఓ పంట చేనులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు గమనించిన గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం ఎవరిది?, హత్యా?, ఆత్మహత్యా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అసమర్థ నాయకులతోనే ఓటమి

- కామారెడ్డిలో సీఎం కేసీఆర్ ఓడిపోవడంపై ఆ నాయకుల్లో చర్చ
- ఖద్దర్ నాయకుల ఒంటెద్దు పోకడతో అసమ్మతి



నవతెలంగాణ-రాజంపేట్

మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ఎన్నికల ఫలితాల అనంతరం బీఆర్ఎస్‌పార్టీలో చిచ్చు మొదలైంది. ఖద్దర్ బట్టలు వేసుకొని తిరిగే అసమర్థ నాయకుల వలనే కామారెడ్డి నియోజకవర్గంలో, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఓటమిపాలైందని కార్యకర్తలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది నాయకులు పలు కార్యకర్తలను కలుపుకొని పోకుండా ఒంటెద్దు పోకడతోనే కేసీఆర్ ఓటమి పాలయ్యారని గ్రామాల్లో కార్యకర్తలు ముచ్చట్లు పెడుతున్నారు. గ్రామాల్లో కార్యకర్తలు ఎక్కువ మొత్తంలో ఉన్నప్పటికీ కార్యకర్తల ఓటు కూడా బీఆర్ఎస్‌కు పడలేదు. ఇందులో ఎక్కువ మొత్తంలో కాంగ్రెస్‌కు ఓటింగ్ పడిందని కార్యకర్తలు పేర్కొంటున్నారు. గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పోలేకపోవడంతో కార్యకర్తల్లో అసమ్మతి ఎదురవుతోంది. గ్రామాల్లో, మండల కేంద్రంలో సీనియర్ నాయకులు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనలేకపోవడంతో ఏదో జరిగిందని కార్యకర్తలు చెవులు కొరుక్కుంటున్నారు. రానున్న రోజుల్లో ఖద్దర్ బట్టలు వేసుకుని రాజకీయం చేసే సీనియర్ నాయకులను మార్చకపోతే బీఆర్ఎస్‌పార్టీ కనుమరుగు అవుతుందని పార్టీ అధిష్టానం కార్యకర్తలతో చర్చించుకుని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా ప్రక్షాళన చేసుకోవాలని కార్యకర్తలు పేర్కొంటున్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

- బీజేపీ రాష్ట్ర నాయకులు మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకులు మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-బోధన్

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందించే బాధ్యత ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిదేనని బీజేపీ రాష్ట్ర నాయకులు మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో బీజేపీ పార్టీ విజయం కోసం శ్రమించిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎన్నికల సమయంలో కొంతమంది ఇతర పార్టీల నాయకులు తనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారని దానిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు డబ్బు, మద్యం పంపిణీ చేసి ప్రలోభాలకు గురిచేశాయని ఆరోపించారు. బీజేపీ పార్టీ నాయకులు ప్రజలకు ఎలాంటి ప్రలోభాలకు గురి చేయకుండా ధర్మం కోసం ఎన్నికల్లో నిలబడ్డామని అన్నారు. భవిష్యత్తులో పార్టీ అధికారంలో వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, కౌన్సిలర్ వినోద్, న్యాయవాది నర్సింహారెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ జానకి

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని బీటీ నగర్ 30వ వార్డులో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన సదస్సులో సీడీపీఓ జానకి పాల్గొని విద్యార్థులకు వారి హక్కులపై అవగాహన కల్పించారు. చట్ట ప్రకారం బాలలకున్న హక్కులు, చట్టాలపై వారికి వివరించారు. కార్యక్రమంలో ఐసిపిఎస్ నాగేల్లి బాబు, సూపర్‌వైజర్ రాధిక, ఆసియా, సౌజన్య, గంగావేణి, శివకుమారి, విజయలక్ష్మి, హైస్కూల్ ఇంచార్జి రజిని తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలు అమలు చేసేలా నిలదీద్దాం

- కాంగ్రెస్ నాయకులు తనను రెచ్చగొట్టవద్దని హెచ్చరిక
- ప్రజల తరపున పోరాడతాం
- మాజీ ఎమ్మెల్యే షకీల్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షకీల్

నవతెలంగాణ-బోధన్

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీ హామీలను అమలు చేసేలా నిలదీద్దామని మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని అప్నా ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, కార్యకర్తలు ఎవరిని విమర్శించవద్దని సూచించారు. 10 సంవత్సరాల పాటు ప్రజలకు ఉత్తమ సేవలందించామని ఈ ఎన్నికలలో ప్రజలు మార్పు కోరుకున్నారని కావున ప్రజల తీర్పును అంగీకరించవలసిందేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చిల్లర నాయకులు ఉన్నారని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి వారిని దూరంగా ఉంచి గౌరవంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ కార్యకర్తలపై, నాయకులపై దాడులు చేస్తున్నారని అలాంటి సంస్కృతి మంచిది కాదని అన్నారు. తనను అనవసరంగా రెచ్చగొట్టవద్దని తాను మూడో కన్ను తెరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం 2, 3 నెలల పాటు మాత్రమే ఉంటుందని తర్వాత రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము నిరంతరం ప్రజల పక్షంగా ఉండి పోరాడతామని అన్నారు. తన వెంట ఉండి తాను నమ్మిన వారే తనను ఎన్నికలలో మోసం చేశారని వారిని దేవుడు క్షమించడని తన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో షకీల్ ఆమేర్ ఎమ్మెల్యేగా ఓడిపోవడంతో సమావేశంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మెన్ వీఆర్ దేశాయ్ వేదికపైనే కన్నీరు పెట్టుకున్నారు. ఈ సమావేశంలో జడ్పీ వైస్ చైర్మెన్ రజిత యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మెన్ సోహేల్, డీసీసీబీ డైరెక్టర్ గంగారెడ్డి, ఏఎంసీ చైర్మెన్ వీఆర్ దేశాయ్, బోధన్ మండల అధ్యక్షులు సంజీవ్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, నవీపేట్ నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల వివరాలందించాలి

- విద్యాధికారి రామస్వామి



మాట్లాడుతున్న విద్యాధికారి రామస్వామి

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా పాఠశాలలో వనరులు, మౌలిక వసతులు గూర్చి ప్రధానోపాధ్యాయులు వివరాలను మండల విద్యా వనరుల కేంద్రానికి అందజేయాలని మండల విద్యాధికారి రామస్వామి అన్నారు. మంగళవారం విద్యా వనరుల కేంద్రంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రాథమిక ఉన్నత ఉచ్చతర పాఠశాల వనరులు, మౌలిక వసతుల పూర్తి వివరాలను సంబంధిత ప్రధానోపాధ్యాయులు మండల విద్యా వనరుల కేంద్రంలో అందజేయాలని, వాటిని యుడైస్‌లో పొందుపరుస్తామన్నారు. ప్రతి పాఠశాలలో వనరులు పాఠశాలకు అవసరమన్నారు. దానితో మౌలిక వసతులు ఏర్పాటు కోసం ఎంతో దోహదపడతాయన్నారు. తప్పులు లేకుండా వివరాలను అందించాలని ఆయన ప్రధానోపాధ్యాయులకు సూచించారు. సమావేశంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనైనా

అభివృద్ధికి మోక్షం లభించేనా..?

- మండల కేంద్రాల్లో సెంటర్ లైటింగ్ లేదు
- పల్లెలకు లేని రోడ్లు
- ఇప్పటికైనా పరిష్కారం చూపాలని కోరుతున్న ప్రజలు



నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ నియోజకవర్గంలో సెంటర్ లైటింగ్ అభివృద్ధితో పాటు పల్లెలకు రోడ్లు వేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా మోక్షం లభించేనా..? అని ప్రశ్న ప్రజల్లో తలెత్తుతోంది. గత పదేండ్లు పాలించిన బీఆర్ఎస్ హయాంలో పరిష్కారం కాని సమస్యలకు ఈ ప్రభుత్వమైనా పరిష్కరించాలని జుక్కల్ నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్, బిచ్కుంద, జుక్కల్, పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్ ఈ ఆరు మండల కేంద్రాల్లో సెంటర్ లైటింగ్ అభివృద్ధి పనులతో పాటు మద్నూర్ మండలంలోని పల్లెలకు రోడ్లు వేయాల్సి ఉంది.

ప్రత్యేక రాష్ట్ర సాధన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ హయంలో అభివృద్ధి చెందని సెంటర్ లైటింగ్ ఏర్పాట్ల అభివృద్ధి గాని పల్లె గ్రామాల రోడ్ల అభివృద్ధి గాని అలాగే మిగిలిపోయాయని చర్చలు మద్నూర్ మండల ప్రజల్లో జోరుగా వినబడుతున్నాయి.

జుక్కల్ నియోజకవర్గంలో ముచ్చటగా మూడుసార్లు ఎమ్మెల్యేగా కొనసాగిన హనుమంత్ షిండే జుక్కల్ నియోజకవర్గంలోని ఏ ఒక్క మండల కేంద్రంలో కూడా సెంటర్ లైటింగ్ అభివృద్ధి పనులు చేపట్ట లేకపోయారు. ఎన్నికల సమయం రాగానే హడావుడిగా అన్ని మండల కేంద్రాల్లో సెంట్రల్ లైటింగ్ అభివృద్ధి పనులకు దాదాపు రూ.42 కోట్ల నిధులు మంజూరైనట్లు అన్ని మండల కేంద్రాల్లో భూమిపూజ చేసి శిలా ఫలకాలు ఏర్పాటు చేశారు. అలాంటి సెంట్రల్ లైటింగ్ అభివృద్ధి పనులు చకచకా జరుగుతాయని ఆశతో అన్ని మండల కేంద్రాల ప్రజలు ఎదురు చూసినప్పటికీ ఆ పనులు శిలాఫలకా లకే పరిమితం అయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాయి. బీఆంఎస్ పార్టీ అధికారం కోల్పోయింది. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అధికారాన్ని కట్టబెట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా జుక్కల్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా తోటా లక్ష్మి కాంతారావు గెలిచారు. ఇటు నియోజకవర్గానికి, అటు రాష్ట్ర ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినందున ప్రత్యేక రాష్ట్ర సాధన అనంతరం 10 సంవత్సరాల కాలంలో చేపట్టని అభివృద్ధి పనులు మండల కేంద్రాల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణాలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయంలో అభివృద్ధి జరుగుతందని ప్రజలు ఆశిస్తున్నారు. వెనుకబడిన జుక్కల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని ప్రజలు కోరుతున్నారు.

వీరభద్ర స్వామి ఆలయంలో కల్యాణోత్సవం

- అన్నదాన కార్యక్రమం



నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని జంగంగల్లీలో గల వీరభద్ర స్వామి ఆలయంలో కళ్యాణోత్సవ కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. కళ్యాణ్ ఉత్సవ కార్యక్రమం సందర్భంగా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ పూజారి సంఘయప్ప తెలిపారు. మంగళవారం సాయంత్రం కళ్యాణ్ ఉత్సవం అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరిగిందని బుధవారం ఉదయం ఆలయం ఎదుట అగ్నిగుండం పూజోత్సవం జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో హాజరై కళ్యాణోత్సవంలో అన్నదాన కార్యక్రమంలో అగ్నిగుండం ఉత్సవాల్లో పాల్గొనాలని ఆలయ పూజారి గ్రామస్తులను కోరారు.

నవతెలంగాణ
4
నిజామాబాద్
బుధవారం | డిసెంబర్ 6, 2023 | www.navatelangana.com

ప్రతిభ కనపరిచిన మగ్గిడి పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మగ్గిడి పాఠశాలకు చెందిన క్రీడాకారులు కలిగోట్ గ్రామంలో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ బీచ్ వాలీబాల్ పోటీల్లో మొదటి స్థానం సంపాదించిన అండర్-14 అండర్-17 బాల బాలికలు మొదటి స్థానం సాధించినట్టు వ్యాయామ ఉపాధ్యాయులు మధు మంగళవారం తెలిపారు. వీరు ఈనెల 8 నుండి పదవ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలో పాల్గొంటారని పేర్కొన్నారు. వీరిని ఎస్జీఎఫ్ సెక్రటరీ సంగీతరావు, పాఠశాల హెడ్మాస్టర్ హరిత, దాస్ నగర్ ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, సర్పంచ్ సుమలత నర్సయ్య వీడిసి సభ్యులు అభినందించారు.



ఎంపికైన మగ్గిడి పాఠశాల విద్యార్థులు

8న మండల సాధారణ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఈనెల 8న మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సంతోష్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి అధ్యక్షతన సమావేశం జరు గుతుందని పేర్కొన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి నివేదికలను 25 కాపీల జిరాక్స్ ప్రతులను ఈనెల 7లోగా మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని సూచించా రు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు సకాలంలో హాజరై సహకరించాలని ఎంపీడీవో కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన న్యూస్ పేపర్స్ బాయ్స్ అండ్ ఏజెంట్ అసోసియేషన్



ఎమ్మెల్యేను కలిసిన న్యూస్ పేపర్ బాయ్స్, ఏజెంట్ అసోసియేషన్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేగా ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త గెలవడంతో న్యూస్ పేపర్స్ ఏజెంట్స్ బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే ఇంటి వద్ద కలిశారు. శాలువాను కప్పి పూల బొకే అందించి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో న్యూస్ పేపర్స్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సభ్యులు పాల్గొన్నారు. పలువురు నగర ప్రజలు వారి, వారి అసోసియేషన్ల వారీగా వచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

నర్సరీని సందర్శించిన ఎంపీడీవో



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపిడిఓ మల్లేష్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని ధర్మారం(ఎం) గ్రామంలో నర్సరీని ఎంపిడిఓ మల్లేష్ మంగళవారం పరిశీలించారు. చెట్లకు నీళ్లు సరిగా పోయాలన్నారు. మట్టి ఏ శాతంలో కలపాలో తెలిపారు. మొక్కలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ కార్తిక ఫీల్డ్ అసిస్టెంట్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు

కమ్మర్‌పల్లిలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు



సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు


నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పెద్దలు ఖరారు చేయడంతో మండల కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు మంగళవారం రాత్రి సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ కూడలిలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సుంకెట రవి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డికి అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు మండల కాంగ్రెస్ పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్ర చేపట్టిన వెంటనే ఆరుగ్యారంటీలను అమలు చేసేందుకు చర్యలు చేపడతారన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చి మల్లయ్య, పాలేపు నరసయ్య, నల్ల గణేష్ గుప్త, సుంకేట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర సీఎంగా ప్రకటించినందుకు కృతజ్ఞతలు

- నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు

నవతెలంగాణ-కంఠేశ్వర్



టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రకటించినందుకు జిల్లా కాంగ్రెస్ పార్టీ తరుపున సోనియా గాంధీకి, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీకి ధన్యవాదాలు అని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి మంగళవారం తెలిపారు. ప్రజల అభీష్టం మేరకు కార్యకర్తల ఆలోచనలకు అనుగుణంగా అధిష్టానం నిర్ణయం తీసుకున్నందుకు అధిష్టానానికి ధన్యవాదాలని పేర్కొన్నారు. రాబోయే కాలంలో సుదర్శన్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు సేవ చేస్తూ జిల్లాను అభివృధి వైపు తీసుకెళ్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-ఆర్మూర్



మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోగల సెయింట్ ఆన్స్ స్కూల్‌లో చదువుతున్న జక్కుల అద్రిజ, వేదాంష్ జిల్లా కేంద్రంలోని ఎస్‌జీఎఫ్ ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో అండర్-14 బాస్కెట్‌బాల్‌కు రాష్ట్రస్థాయిలో ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సుమలత, వ్యాయామ ఉపాధ్యాయుడు కిరణ్ కృష్ణ, కోచ్ వంశీకృష్ణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థినిలను అభినందించారు.

రేవంత్ రెడ్డిని సీఎంగా ప్రకటించడంతో

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి/ధర్పల్లి

ఏఐసీసీ అదిష్టానం మంగళవారం రాత్రి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గా కొడంగల్ ఎమ్మెల్యే ఎనుముల రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా ప్రకటించడంతో డిచ్‌పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అమృత పూర్ గంగాధర్, మాజీ కో ఆప్షన్ సభ్యులు శ్యాంసన్ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త మనస్సులో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఉండేదని, దాని కనుగుణంగానే ఎఐసిసి సమావేశంలో ఏకగ్రీవంగా ఏకవాఖ్య తీర్మానం చేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల మనస్సు గెలుచుకుందని అన్నారు. ఇక రేవంత్ రెడ్డి పాలనలో ప్రజల సాదక బాదకాలు తీరుతాయని అశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కంచేట్టి గంగాధర్, సీనియర్ నాయకులు డాక్టర్ శాదుల్లా, ధర్మాగౌడ్, ఇర్ఫాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్పల్లి : టపాసులు కాలుస్తున్న నాయకులు, కార్యకర్తలు



డిచ్‌పల్లి : సంబరాలు చేసుకుంటున్న నాయకులు

ధర్పల్లి :తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ముఖ్య మంత్రిగా రేవంత్ రెడ్డిని ఖరారు చేయడం పట్ల మంగళ వారం సాయంత్రం మండల కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు హర్షం వెక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ ఆధ్వర్యంలో మండలకేంద్రములో ని గాంధీ విగ్రహం వద్ద టపాసులు కాల్చి భారీ ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. అనంతరము ఒకరికొకరు మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమములో నాయకులు చెలిమేల నర్సయ్య, కమ్మరి గంగాధర్, మిట్టపల్లి గంగారెడ్డి, ప్రవీణ్, చెలిమేల శ్రీనివాస్, వై గంగాధర్, అబ్దుల్ హమీద్, ఆర్మూర్ రంజిత్, అరుగుల బాలిరెడ్డి, కచ్చా కాయల గంగాధర్, ఖలీల్, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లకు రుణాలు అందజేస్తాం

- డీఆర్డీవో పీడీ చందర్ నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వ్యవసాయానికి సంబంధించిన వ్యవసాయ పనిముట్లు, హార్వెస్టర్ కోత యంత్రం పనిముట్లు కొనుగోలు చేయుటకు రుణాలను అందజేస్తామని, జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాట్లు చేసుకోవడానికి ముందుకు రావాలని డీఆర్డీఓ, డిఆర్డీఏ పీడీ చందర్ నాయక్ అన్నారు. మంగళవారం జిల్లా మహిళ సహకార సమాఖ్య సమావేశం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఘన్పూర్ శివారులోని ట్రైజం సెంటర్(టీటీడిసి)లో జిల్లా అధ్యక్షురాలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్డిఓ పీడీ చందర్ నాయక్ హాజరై మాట్లాడారు. ఏదైనా వ్యాపారంలో ఆదాయం వచ్చేటట్లు చూసుకుంటు ఇతర వ్యాపారాలు చేసుకోవా లన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలను, వీఓలతో, ఎంఎస్ 2024 మార్చి 31 వరకు టార్గెట్ నిమిత్తం రుణాలను సభ్యులు తీసుకోవా లన్నారు. స్త్రీ నిధిలో సోలార్ సిస్టమ్స్, ఎలక్ట్రిక్ వాహనాలకు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇలాంటి అవకాశాలను ఇతరులకు వివరించి వారికి లబ్ది చేకూరేలా కృషి చేయాలని సూచించారు. సమావే శంలో ఎపీడీ టి.మధుసూదన్, డీపీయం ఎన్.శ్రీని వాస్, ఎపియం సరోజిని, డీపీయం సంధ్యారాణి, డీపీయం నీలిమా, సాయిలు, మారుతి, రాచయ్య మహిళా సమాఖ్య సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న పీడీ



మాట్లాడుతున్న పీడీ చందర్‌నాయక్

మున్సిపల్ కార్యాలయం

రియల్ ఎస్టేట్ ఆఫీసుగా మారింది

- బీజేపీ నాయకుల ధర్నా

నవతెలంగాణ-ఆర్మూర్

రియల్ ఎస్టేట్ ఆఫీసుగా మున్సిపల్ కార్యాలయం మారిందని బిజెపి ఫ్లోర్ లీడర్ జివి నరసింహారెడ్డి అన్నారు. మున్సిపల్ ఆఫీస్ ముందు బిజెపి ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలక వర్గం వచ్చిన నాలుగు సంవత్సరాల నుంచి పెర్కిట్, మామిడిపల్లి, ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ భూముల్లో ఇరిగేషన్ భూముల్లో ఇంటి నెంబర్లు మంజూరు చేస్తూ లక్షల రూపాయలు చేతులు మారినా ఖాళీ ప్లాటుకు ఒక హౌస్ నెంబర్ జోడించి ఆ హౌస్ నెంబర్లకు మున్సిపల్ రికార్డులు లేకపోవ డం ఆశ్చర్యకరమని అన్నారు. మున్సిపల్ అధికారుల కు ముడుపులు ముట్టిన వెంటనే చైర్మన్‌కు పెద్ద మొత్తంలో డబ్బులు అందడంతో ఈ హౌస్ నెంబ ర్లను అనుమతించారని ఆరోపించారు. మున్సిపాలిటీ ఒక రియల్ ఎస్టేట్ ఆఫీస్ లాగా నాలుగు దిక్కుల నుంచి నలుగురు చైర్మన్లు పరిపాలిస్తున్నారని అన్నారు. టౌన్ ప్లానింగ్ కమిషనర్, పాలకవర్గం కలిసి ఆర్మూర్ మున్సిపల్‌ను దోచుకుంటున్నారని తెలిపారు. మున్సిపల్‌లో 100 కోట్లు అవినీతి జరిగిందని, దీన్ని కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి సిటింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఉదయ్ కుమార్, కౌన్సిలర్ సాయికుమార్, ఆకుల శ్రీనివాస్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు పోల్కం వేణు, నర్సారెడ్డి, కార్యకర్తలు యువ మోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బ్రహ్మాండమైన విజయమిది

- మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డిని కలిసిన ఇమ్మడి గోపి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయ దుందుభి మోగించడంతో ధర్పల్లి మాజీ ఎంపీపీ, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇమ్మడి గోపి మంగళవారం వేర్వేరుగా కలిసి సన్మానించి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇమ్మడి గోపి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను పట్టించుకోకుండా తమ కుటుంబానికి లబ్ది చేకూర్చే విధంగా చూసుకున్నారని, దీంతో ప్రజలు ఆగ్రహించి కనివిని ఎరుగని రీతిలో తీర్పు ఇచ్చారని అన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు బ్రహ్మాండమైన విజయాన్ని అందజేశారని, ఈ విజయంతో కేసీఆర్ దిమ్మ తిరిగిందన్నారు. ఈ ఎన్నికలు నీతికి నిజాయితీ మధ్య జరిగాయని, ప్రజలు అన్ని ఆలోచించే కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని ఇమ్మడి గోపి పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో అరాచకం ఎక్కువగా కావడంతో ప్రజలు భరించుకోలేదని, నీతి నిజాయితీగా ఉన్న అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు, ధన్యవాదాలు తెలిపారు.



భూపతిరెడ్డికి బొకేను అందజేస్తున్న ఇమ్మడిగోపి

పదవ తరగతి పరీక్ష ఫీజుకు 7 వరకు గడువు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

వచ్చే మార్చి 2024లో జరిగే పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు గడువును మరోసారి పొడిగించారు. ఆలస్య రుసుం లేకుండా ఫీజు చెల్లింపు గడువు నవంబరు 17 వరకు ఉండగా దాన్ని డిసెంబరు 2వ వరకు పెంచారు. తాజాగా ఆ గడువును ఈ నెల 7 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు ఎ. కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 ఆలస్య రుసుంతో 14 డిసెంబర్ 2023 వరకు, రూ. 200 రూపాయల ఆలస్య రుసుంతో 21 డిసెంబర్ 2023 వరకు, రూ.500 ఆలస్య రుసుంతో జనవరి 3 వరకు గడువు ఉన్నట్లు పేర్కొన్నారు. పాఠశాలల్లో పరీక్ష ఫీజును చెల్లించవచ్చని తెలిపారు. సంపూర్ణ సమాచారం www. bse. telangana .gov.in వెబ్ సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

ప్రెస్‌క్లబ్ నూతన మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-రెంజల్

ప్రెస్‌క్లబ్ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులు మొనాజీ గారి నాగిరెడ్డి, భోదనం శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జక్కల సంతోష్ (ఆంధ్రప్రభ), ఉపాధ్యక్షులుగా మమ్మాయి నాగరాజ్ (ప్రజాజ్యోతి), ప్రధాన కార్యదర్శిగా బేగరి కిరణ్ (ఆంధ్రజ్యోతి), కోశాధికారిగా ఎస్.గంగాధర్‌గౌడ్ (నవతెలంగాణ), సంయుక్త కార్యదర్శిగా సాకిన్ గారి రవి (కే 6), ముఖ్య సలహాదారులుగా మోనాజీ గారి నాగిరెడ్డి (ఈనాడు), భోదనం శ్రీనివాస్ (సాక్షి)ని ఎన్నుకున్నారు.

ఉపాధి, ఉద్యోగ అవకాశాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), తెలంగాణ ప్రభుత్వంలోని కార్మిక ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్ రిక్రూట్మెంట్ ఏజెన్సీ, వివిధ దేశాల్లో నర్సింగ్ కోసం విదేశీ ఉద్యోగ నియామకాలను సులభతరం చేయడానికి ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తారని నిజామాబాద్ జిల్లా ఉపాధి కల్పనా అధికారి సిరిమల్ల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్ట్రేలియా, కెనడ, యూకే., జెర్మనీ ఇతర యూరోపియన్ దేశాల వంటి అనేక అభివృధి చెందిన దేశాల్లో అర్హత కలిగిన నర్సులు, ఇతర ఆరోగ్య సంరక్షణ కార్మికులకు పెద్ద డిమాండ్ ఉందని పేర్కొన్నారు. చట్టబద్ధమైన మార్గాల ద్వారా అర్హత కలిగిన అభ్యర్థులకు శిక్షణ, భాష నైపుణ్యాలను, విదేశీ ఉద్యోగ నియామకాలను అందించడానికి టామ్‌కామ్ ఈ దేశాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ నమోదిత ఏజెన్సీలతో భాగస్వామ్యం కలిగి ఉందని తెలిపారు. ఈ సందర్భంలో టామ్‌కామ్ దేశంలోని నిర్దిష్ట నర్సింగ్, సంబంధిత ఉద్యోగ అవకాశాల గురించి సమాచారాన్ని అందించడానికి తెలంగాణలోని వివిధ జిల్లాల్లో నమోదు డ్రైవ్ కామ్ వర్కుషాపులను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈనెల 7న 10.30కు నిజామాబాద్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయం, శివాజీ నగర్, ఐటీఐ క్యాంపస్‌లో సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం www.tomcom.telangana.gov.in, 8247838789, 9849639539, 7893566493 సంప్రదించాలని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఆర్మూర్



రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న అందజేస్తున్న వినయ్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని ఎంపిక చేయడంతో మంగళ వారం కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కొడంగల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిపై టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి సుమారుగా 32వేల పైచిలుకు మెజారిటీతో గెలుపొందడం అభినందనీయమని అన్నారు. తెలంగాణలో తొలిసారి అధికార పీఠం కాంగ్రెస్ కైవసం చేసుకోవడం చారిత్రక ఘట్టమని అన్నారు.

మాజీ ముఖ్యమంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మోపాల్



కేసీఆర్‌ను కలిసిన బాజిరెడ్డి గోవర్ధన్, బాజిరెడ్డి జగన్

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఆయన తనయుడు బాజిరెడ్డి జగన్‌తో ఎర్రవల్లిలోని సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నిజామాబాద్ రూరల్ ఎన్నికల వివరాలను తెలుపుతూ ఆయనతో మాట్లాడారు. అలాగే బాజిరెడ్డి జగన్ కేటీఆర్‌తో కూడా ఎలక్షన్ వివరాలను తెలిపారు.

బురే దిన్ ఖతం హొగయే..

అచ్చేదిన్ ఆనే వాలే హై..



నవీపేట్ : సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నవీపేట్/మోపాల్

రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ అధిష్టానం సీఎం అభ్యర్థిగా ప్రకటించడంతో మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం టపాకాయలు పేల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డితో పాటు సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో మూడు పర్యాయాలు నియోజకవర్గంలో సుపరిపాలన చేశారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల దరిద్రపు పాలన దూరం కాబోతుందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధాకర్, కృష్ణ, జబీర్, గౌతమ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

మోపాల్ : మోపాల్ మండలంలోని తానాకుర్తి గ్రామంలో రేవంత్ రెడ్డిని సీఎంగా ప్రకటించిన వెంటనే కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణాసంచాలు పేల్చి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా మాజీ విండో చైర్మన్ సూర్య రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ కు తగిన నాయకుడు రేవంత్ రెడ్డి అని ఆయన నాయకత్వంలో ప్రజలకు పూర్తి న్యాయం జరుగుతుందని. ముఖ్యంగా కుటుంబ పాలన నుండి విముక్తి కలిగిందని రేవంత్ రెడ్డి సహకారంతో రూరల్ నియోజకవర్గం లో భూపతిరెడ్డి పాలనలో రూరల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెంది ప్రగతి పథంలో ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

20లోపు హజ్ యాత్రికులు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



2024 సంవత్సరంలో హజ్ యాత్రకు వెళ్లాలనుకునే వారు 20లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షులు షాహిద్ అహ్మద్ తవక్కల్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హజ్‌కు వెళ్లేవారు పట్టణంలోని భుక్తాపూర్ కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా దరఖాస్తులు చేస్తామన్నారు. ఉదయం పది గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9849214764, 9394354477లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో హజ్ సొసైటి కార్యదర్శి ఎంఏ హసీబ్, జాయింట్ సెక్రెటరీ ఎంఏ షాహిద్, జఫిఉల్లాఖాన్, నూర్‌ఖాన్ పాఠన్ పాల్గొన్నారు.

రేవంత్ ముఖ్యమంత్రి కావాలని నాగోబాకు పూజలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఆదివాసులు నాగోబాకు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలో కాంగ్రెస్ నాయకులు మెస్రం నాగనాథ్, పటేల్ వెంకట్‌రావ్, పూజారి షేక్ నాథ్, లచ్చు పటేల్, ఆత్రం అశోక్ ఆధ్వర్యంలో నాగోబాకు పూజలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని, దీనికి సీఎంగా రేవంత్‌ను నియామించాలని కోరుతూ నాగోబాకు ప్రార్థించినట్లు వారు తెలిపారు. అదే విధంగా ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆదివాసీ బిడ్డ వెడ్మ బొజ్జుకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదవీ ఇవ్వాలని కోరారు. పార్టీ కోసం పని చేసిన వారిని గుర్తించి అధిష్టానం సరైన గుర్తింపు ఇవ్వాలన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ప్రభుత్వ అధికారులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

నూతన ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం ఆయన నివాసంలో కలిసిన అధికారులు పుష్పగుచ్ఛం అందించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రజ సమస్యల పరిష్కరించే దిశగా కృషి చేద్దామన్నారు.

స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో లోహిత్‌కు స్వర్ణం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ వింటర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆదిలాబాద్‌కు చెందిన క్రీడాకారుడు లోహిత్ సాయి స్వర్ణం సాధించారు. 200 మీటర్స్ బటర్ ఫ్లై విభాగంలో స్వర్ణ పతాకాన్ని గెలుచుకున్నాడు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడకారుడిని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్నీ పతకాలు సాధించాలని ఆకాక్షించారు. జాతీయస్థాయి పోటీలకు సన్నద్ధం అయ్యేందుకు తను కోచింగ్ ఇస్తానని ఈ సందర్భంగా కొమ్ముకృష్ణ తెలిపారు.

పుట్టినరోజు సందర్భంగా విలేఖరి రక్తదానం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పుట్టిన రోజున సామాజిక బాధ్యతగా ఆదిలాబాద్‌కు చెందిన ఓ యువకుడు రక్తదానం చేసి ఉదారత చాటుకున్నాడు. పట్టణంలోని సుభాష్ నగర్ కాలానికి చెందిన విలేకరి గాజరి శ్రీకాంత్ తన పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేస్తు వస్తున్నాడు. ఇందులో భాగంగానే మంగళవారం తన పుట్టినరోజును పురస్కరించుకుని రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేసి ఉదారతను చాటుకున్నాడు. రక్తదానం చేయడం ఇది నాల్గవసారి అని, యువత స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. సామాజిక బాధ్యతగా తాను రక్తదానం చేయడాన్ని జర్నలిస్టులు, మిత్రులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సుధాకర్, సురేష్, నిలేష్, మహేందర్, మహేష్, వెంకటేష్ ఉన్నారు.

సొసైటీ డైరెక్టర్‌ను పరామర్శించిన మాజీ మంత్రి



నవతెలంగాణ-బోథ్

మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్ శ్యామ్‌రావు పటేల్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గోడం నగేష్ మంగళవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బోథ్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అదే గ్రామానికి చెందిన మాధవి, లాలీబాయి, జంగుబాయిని పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ ఛైర్మెన్ కదం ప్రశాంత్, సర్పంచులు సురేందర్ యాదవ్, శ్రీధర్ రెడ్డి, కొడపా విజయ్, ఎంపీటీసీ జుగాది రావు, నాయకులు ఇమ్రాన్, సత్యనారాయణ, బాపురావు, లక్ష్మణ్, శ్రీను ఉన్నారు.

నేడు పత్తి కొనుగోళ్లు బంద్

నవతెలంగాణ-బోథ్

వ్యవసాయ మార్కెట్ పరిధిలోని బోథ్, పోచ్చర, సోనాల జిన్నింగ్‌లలో సీసీఐ పత్తి కొనుగోళ్లనిలిపివేస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి దేవన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాతావరణం అనుకూలంగా లేనందున మిచెంగ్ తుఫాన్ వలన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. పత్తిని తీసుకువచ్చే సమయంలో రైతులు ఆరబెట్టుకొని తీసుకువరావాలన్నారు. నాణ్యమైన పత్తికి మార్కెట్ మంచి ధర వస్తుందన్నారు. ఈ విషయంలో రైతులు సహకరించాలని కోరారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే శంకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీఎన్జీఓ నాయకులు, ఉద్యోగులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం టీఎన్జీఓ నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. శాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. టీఎన్జీఓ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంద అశోక్, ఎడ్ల నవీన్ కుమార్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కరానికి తన పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ నాయకులు తిర్మల్ రెడ్డి, గోపి, రాజేశ్వర్, ప్రశాంత్, అరుణ్, దేవేందర్, సునిల్, రవీ, ఓం ప్రసాద్, కలీం, దత్తు, గంగాదర్ ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గౌడ కులస్తులు

ఆదిలాబాద్ రూరల్ : ఎమ్మెల్యే పాయల శంకర్‌ను సర్దార్ సర్వయ్ పాపన్న గౌడ్ వెల్పేర్ సొసైటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కుల సంఘాల అభివృద్ధికి తన వంతుగా సహకారం అందిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, సాయి, చైతన్య, నాగేందర్ గౌడ్, రాజు గౌడ్, ప్రణయ్ గౌడ్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో సీపీఐ కీలక పాత్ర

- జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి



సంబరాలు జరుపుకుంటున్న సీపీఐ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో మిత్రపక్షమైన కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ప్రకటించిన విధంగానే ఆరు గ్యారంటీల అమలులో సీపీఐ కీలక పాత్రను పోశిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. కొత్తగూడం నుంచి పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాంబశివ రావ్ మేజార్టీతో గెలుపొందడాన్ని హర్షిస్తూ మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. భుక్తాపూర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద టపాసులు పేల్చి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మిత్రపక్షమైన కాంగ్రెతో రాష్ట్రంలో సీపీఐ మద్దతుగా పోటీ చేసిన ఒక్క స్థానంలో భారీ మేజార్టీతో గెలుపొందిందన్నారు. కాంగ్రెస్ కూడా భారీ మేజార్టీతో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని తెలిపారు. ప్రజలను విస్మరిస్తే పుట్టగతులు ఉండబోవనే విషయాన్ని కేసీఆర్ గుర్తించారన్నారు. నియంత పాలనకు ప్రజలకు తగిన బుద్ధి చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలులో సీపీఐ తన పాత్ర పోశిస్తుందని, ఎదైన తప్పు జరిగితే కాంగ్రెస్‌పై కూడా పార్టీ ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నళినిరెడ్డి, అరుణ్ కుమార్, సాట్వాజీ, తబ్రేజ్, పర్వీన్ పాల్గొన్నారు.

స్త్రీలపై హింసకు పాల్పడితే కఠిన చర్యలు



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సఖి కేంద్రం నిర్వాహకులు

నవతెలంగాణ-జైనథ్

స్త్రీలపై హింసకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సఖి కేంద్రం అడ్మినిస్ట్రేటర్ సరస్వతి అన్నారు. స్త్రీ హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ప్రచారోద్యమంలో భాగంగా నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 మానవ హక్కుల దినం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సఖీ కేంద్రం, డీహెచ్‌ఈడబ్ల్యూ విభాగం సంయుక్తంగా మండల కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆషా వర్కర్స్‌కి, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినం ఈ సంవత్సరం యూనైట్ ఇన్వెస్ట్ టూ ప్రివెంట్ వయోలేన్స్ ఎగైనెస్ట్ ఉమెన్ అండ్ గర్ల్ గురించి వివరించామన్నారు. ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల కోసం ప్రత్యేక చట్టాలున్నాయని, సమాజంలో టెక్నాలజీ పెరిగిన మహిళలు, చిన్నారులపై హింసలు ఆగడం లేదన్నారు. సఖి కేంద్రంలో వచ్చిన బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అత్యవసర సమయంలో తమని సంప్రదించాలని సూచించారు. సఖి కేంద్రంలో అందించే సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా కోఆర్డినేటర్ యశోద, మెడికల్ ఆఫీసర్ నయనతార, కమ్యూనిటి హెల్త్ ఆఫసర్ అంజయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అశా వర్కర్స్ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



జన శిక్షణ సంస్థ పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎస్ఓ

కేంద్ర వృత్తి నైపుణ్య అభివృద్ధి మంత్రిత్వ శాఖ జన శిక్షణ సంస్థ ద్వారా అందించే శిక్షణాలు సద్వినియోగం చేసుకోవాలని డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళశారం జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో జన శిక్షణ సంస్థ పాలకవర్గ సమావేశాన్ని సంస్థ చైర్మెన్ పిట్ల మమత అధ్యక్షతన నిర్వహించారు. దీనికి జిల్లా క్రీడాలు యువజన శాఖ జిల్లా అధికారి ఎన్ వెంకటేశ్వర్లు, డీఈఓ ప్రణీత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వృత్తి నైపుణ్య కోర్సులు నేర్చుకుంటు కుటుంబ ఆర్థిక పోషణలో భాగస్వాములు కావాలన్నారు. జిల్లాలోని వివిధ మండలాలలో ప్రస్తుతం అమలవుతున్న శిక్షణ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పూర్తి అయిన శిక్షణాలను సంస్థ ఛైర్మెన్ మమత వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పద్మభూషణ్ రాజు, లీడ్ బ్యాంకు మేనేజర్ భాస్కర ప్రసాద్, సేడ్స్ డైరెక్టర్ అర్ సురేందర్, జన శిక్షణ సంస్థ డైరెక్టర్ చేన్నాల రాజన్న, సభ్యులు సీహెచ్ శశికళ, మసూద్, అన్వరి, డాక్టర్ చంద్రకాంత్, కాంబ్లే వర్ష, యోగిత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాను ప్రభావంతో పత్తి కొనుగోళ్లకు బ్రేక్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మిచెంగ్ తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తం అయింది. రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. తుఫాను ప్రభావం ఉత్తర తెలంగాణపై ఎక్కువగా ఉండబోతుందని వాతావరణ శాఖ తెపాడంతో జిల్లాలో పత్తి కొనుగోళ్ల ప్రక్రియను బుధవారం నిలిపివేస్తున్నట్లు మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. వర్షంతో పత్తి తడిపోయి రైతులకు ఇబ్బందులు కలుగుతాయనే ముందస్తుగానే మార్కెటింగ్ శాఖ పలు సూచనలు చేసిందన్నారు. బుధవారం కొనుగోళ్ల జరగవనే విషయం తెలుసుకున్న రైతులు మంగళవారం పెద్ద ఎత్తున తమ పత్తిని విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకువచ్చారు. తుఫాను ప్రభావం కారణంగా వర్షాలు పడే సూచనలు ఉండడంతో బుధవారం కొనుగోళ్లను నిలిపివేస్తున్నామన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. కొనుగోళ్ల ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ వ్యాపారులు లక్ష 76 వేల 560 క్వింటాళ్లు, సీసీఐ 30 వేల 411 క్వింటాళ్లు మొత్తం 2 లక్షల 69 వేల 71 క్వింటాళ్లు కొనుగోళ్లు చేశామన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అంకొలి పీహెచ్‌సీ డాక్టర్ సర్ఫరాజ్ అన్నారు. ఈనెల 15న ఎన్‌క్యూఏఎస్ ఢిల్లీ బృందం పర్యటించనున్న నేపథ్యంలో ఆయన మంగళవారం పీహెచ్‌సీ పరిధిలోని వాఘాపూర్ సబ్ సెంటర్‌ను సందర్శించారు. సబ్ సెంటర్‌లోని రిజిస్టర్స్, రికార్డులు, పరికరాలు, వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు, ఎమర్జెన్సీ మెడిసిన్, ల్యాబ్ పరికరాలు, చాట్స్, గార్డెన్‌లను పరిశీలించారు. సబ్‌సెంటర్‌కు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. 15న కేంద్ర బృందం పర్యటించనున్న నేపథ్యంలో సబ్‌సెంటర్‌లో వసతులుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఆడే సురేష్, బొమ్మెత సుభాష్, ఎంఎల్‌హెచ్‌పీ రోజా రమణి, ఆరోగ్య కార్యకర్తలు గెడం సంగీతా, సీహెచ్ లలితా, ట్రైనింగ్ స్టూడెంట్స్ ఆశా, దీప శ్రీ, ఆశా కార్యకర్తలు గౌరు బాయి, కమల, సుమన్ బాయి, కౌసెల్య, నాగుబాయి, శాంతాబాయి, భాగ్యలక్ష్మీ బాయి పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న యువకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ అభిమాన నాయకుడు పాయల శంకర్ ఎమ్మెల్యేగా గెలవాలని మహాలక్ష్మీవాడ యువకులు మొక్కులు మొక్కారు. ఆదివారం లెక్కింపులో పాయల శంకర్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో మంగళవారం మహాలక్ష్మీవాడ యువకులు కాలనీలో భారీ హనుమాన్ విగ్రహం వద్ద 101 కొబ్బరి కొట్టి తమ మొక్కులను చెల్లించుకున్నారు. దీంతో పాటు మరిన్ని మొక్కులు కూడా ఉన్నాయని వాటిని కూడా చెల్లించుకుంటామని యువకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాలనీ యువకుడు అక్షయ్ మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా పాయల శంకర్ గెలుపు కోసం అనేక కృషి చేశామన్నారు. దేవతలకు మొక్కులు మొక్కామని తెలిపారు. తమ కల నెరవేడంతో తమ మొక్కులను చెల్లించుకుంటున్నామని పేర్కొన్నారు. పాయల శంకర్ గెలుపుకు ప్రత్యేక్షంగా, పరోక్షంగా సహకారం అందించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా వారు ధన్యవాదలు తెలిపారు.

నేడు అంబేద్కర్ వర్ధంతి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో 67వ భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని బుధవారం ఎస్సీ కార్పొరేషన్ ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుందని భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞాకుమార్ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్ ప్రాంగణంలో జరిగే వేడుకలకు కలెక్టర్ రాహుల్ రాజ్, స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్‌తో పాటు అధికారులు పాల్గొంటారని తెలిపారు. అదే విధంగా అంబేద్కర్ చౌక్, బస్టాండ్ ఎదుట గల అంబేద్కర్ విగ్రహం వద్ద, కైలాస్‌నగర్‌లో అశోక బుద్ధ విహార్‌లో వేడుకలను నిర్వహిస్తామని తెలిపారు. దీనికి బౌద్ధ ఉపాసిక, ఉపాసికలు, అంబేద్కర్ వాదులు, పార్టీలు, కుల సంఘాలకు అతీతంగా ప్రతి ఒక్కరు హాజరై వర్ధంతి కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దయానంద్, కోశాధికారి కాంతారావు, కుశ్వర్త బాయి లాండ్గె, అమరపాల, బేబీ బాయి, రాజు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ప్యానల్ టీం



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని జామడ బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం ప్యానల్ టీం సందర్శించింది. దీనిలో భాగంగా టీం హెడ్ అనుషా పాఠశాల పరిసరాలతో పాటు తరగతి గదులు, సైన్స్ లాబ్, స్పోర్ట్ రూం, వంట గదులను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను చూసి హర్షం వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలను సైన్స్ మోడల్ పాఠశాలగా ఏర్పాటు చేయడం అభినందనీమన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ముందుగా మెను రిజిస్టర్‌ను పరిశీలించారు. వారి వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రూ, పీడీ అడే విశ్వనాథ్, ఉపాధ్యాయులు ప్రేమ్ కుమార్, పుష్ప, శివాజీ, హరిచంద్, చంపావతి, గంగాధర్, మల్కు ఉన్నారు.